# పేను పెసరచేను

అనగా అనగా (అంటే, అన్ని కాలాల లోనూ చెప్పుకొనే కథలో) ఒక పేను. అతడికి చేదోడు వాదోడుగా మంచి స్నేహితుడు నల్లి. పేను ఎంతో కష్టపడి పెసరచేను వేసుకుంది. 'రక్తం ధారపోసి' పెంచటం వల్లనో, ఏమో, చేను ఏపుగా పెరిగి విరగకాసింది. పేను, నల్లి, ఆనందంతో సంబరాలు చేసుకున్నారు.

ఆ దేశపు రాజుగారు ప్రజల స్థితిగతులు తెలుసుకోవటానికి స్వయంగా గుఱ్ఱంమీద బయలుదేరాడు. అతడిముందు వెనుకల కారుల్లో సాయుధులైన యెస్కార్ట్స్ ఉన్నారు. రాజు బుల్లెట్ ప్రూఫ్ కవచంలో ఉన్నాడు. రాజు కన్ను పెసర చేను మీద పడింది.



సి.ఆనందారామం

విరగకాసిన పెసరచేను! ఆ చేను పేను వేసుకున్నదని తెలుసుకున్నాడు.

గుఱ్ఱం దిగి స్వయంగా పేను గుడిసె ముందుకు వచ్చి నిలబడ్డాడు. ఆయనను చుట్టుకొని సాయుధభటులు దిగారు. రాజు మాత్రం (పాపం!) నిరాయుధుడే!

పేను తత్తరపడ్డాడు "తమరు మా ఇంటికి రావటమా మహాప్రభో!" అన్నాడు 'నెత్తిన చేతులు పెట్టుకుని'. అతడి కళ్ళలో ఆనందా శ్రువులో, మరేవిటో, కాని క్రిందకి జారకుండ గిరగిర తిరుగు తున్నాయి. శరీరమంతా ముచ్చెమటలు! గుండె అదే పనిగా కొట్టుకుంటోంది.

రాజు చిర్నవ్వు విసిరాడు.

"అదేమిటి పేనూ! ఎందుకింత ఆర్భాటం? నువ్వు నా వాడివి. నేను నీ ఇంటికొస్తే నీకు కంగారుదేనికి? కాసిని మంచినీళ్ళయినా అడగనులే!"

పులుకు పులుకున చూసాడు పేను.

"నీ పెసరచేను కోయించటం, నిలవ చెయ్యటం, మార్కెట్‌కి పంపటం, -ఇదంతా నీకు యాతన. నేను లేనూ! ఈ పెసరచేను మొత్తం కోయించి మా గోడౌన్‌లో పెట్టిస్తాను... నేను ఏంచేసినా మీకోసమే కదయ్యా! రేపు మా ఆఫీస్‌కొచ్చి నీ పంటకి రావలసిన డబ్బు తీసుకో! లెక్కకట్టి ఉంచుతారు" అన్నాడు, రాజు.

పేను మాట్లాడలేదు.

రాజు పేను సమాధానంకోసం ఎదురుచూడలేదు. క్షణాలలో రాజు పరివారం పెసరచేను కోసేసింది. కారుడిక్కలలో నింపేసింది. ముందువెనుకల కార్లు నడుస్తుండగా గుఱ్ఱంమీద సాగి పోయాడు, రాజు – ప్రజల యోగక్షేమాలు పరిశీలిస్తూ.

పేను తన పెసరచేనులా ఖాళీ అయిపోయాడు.

విషయం తెలుసుకుని నల్లి వచ్చాడు.

"ఏడవకు. ఏడ్చి ఏంలాభం? నీ కన్నీళ్ళకు విలువలేదు" అని ఓదార్చాడు.

అప్పటివరకూ తను ఏడుస్తున్నట్లు పేనుకు తెలియదు. కళ్ళు తుడుచుకున్నాడు. అవి ఎఱ్ఱగా మండుతున్నాయి.

"ఏదో ఒకటి చెయ్యాలి!"

కసిగా అన్నాడు, పేను.

"నువ్వూ, నేనూ ఏం చెయ్యగలం?"

నల్లి గొంతులో నిరాశ-

"నిజమే! నువ్వూ నేనూ ఏం చెయ్యలేం! మనకంటె బలమయిన వర్గాలను కలుపు కోలేమా?"

"వాళ్ళు కలుస్తారా?"

"ప్రయత్నిద్దాం!"

పేనూ, నల్లి కొంతదూరం ప్రయాణం చేసి తేలును కలుసు కున్నారు.

"వృశ్చికంగారూ! దణ్ణాలు!" అన్నాడు పేను. ఈ మర్యాదకి తేలు తెల్లబోయాడు. తనను చూడగానే పారిపోతారు, లేకపోతే, చెప్పుతీసుకు కొడతారు. మర్యాదగా పలకరించేవారెవరు?

"ఏమన్నావూ?" అన్నాడు, "వృశ్చికం" అంటే సరిగా అర్థంకాక.

నల్లి అందుకున్నాడు.

"తమరి గొప్ప తమకి తెలియదు- తమ పేరు మీద ఆకాశంలో నక్షత్ర రాశి ఉంది. మీ కీర్తి ఈ దేశంలోనే కాక దేశదేశాలలోనూ వ్యాపించింది. అందుకే మిమ్మల్ని "వృశ్చికంగారూ!" అన్నాం!" వివరించాడు నల్లి. తేలు పొంగిపోయాడు.

కథ

"ఏం పనిమీద వచ్చారు?"

"చాలా చిన్న సహాయం. మీరు తలుచుకొంటే, కానిదే ముందీ? పేను పెసరచేను వేసుకొంటే రాజు వచ్చి కోసుకు పోయాడు. పేను కుమిలిపోతున్నాడు. మనం ఎలా అయినా రాజుకి బుద్ధి చెప్పాలి."

విన్నవించాడు నల్లి.

తేలు కంగారుపడిపోయాడు.

"రాజుకి బుద్ధి చెప్పటమా? ఇంకా నయం. ఎంత మందీ మార్బ లం! మనను బతకనిస్తారా?"

"ఈరోజు పేను పెసరచేను కోసుకున్నాడు. రేపు మీ ముల్లుతో

వాళ్ళనీ, వీళ్ళనీ పొడిచి పోగేసుకున్న ధన కనక వస్తు వాహనాలన్నీ లాక్కుపోతారు. ఏదో ఒకటి చెయ్యక్కర్లేదా?"

తేలు ఆలోచనలో పడ్డాడు.

"నిజమే! కానీ, మనం ముగ్గురం చాలం! మనకంటె బలమైన వర్గాన్ని కలుపుకోవాలి!"

పేను, నల్లి, తేలు, కలిసి ప్రయాణం సాగించి పాము దగ్గిరకెళ్ళారు.

"సర్పరాజుగారూ! సర్పరాజుగారూ!" పిలిచాడు, నల్లి.

పాము పుట్టల్లోంచి కొద్దిగా తొంగిచూసి, ప్రమాదం లేదని నిర్ధారించుకుని బయటికి వచ్చాడు.

"ఏమిటి, ముగ్గురూ ఇలా వచ్చారూ?" అన్నాడు. నల్లి అందుకున్నాడు.

"అయ్యా! తమరి కీర్తి తెలుగు సినిమాలకూ, టి.వి. సీరియల్స్‌కీ కూడా పాకింది. జనం తమను దేవుడుగా భావించి, ఆరాధిస్తున్నారు. తమ దర్శనానికి వచ్చాం!'

"అవుననుకోండి! నాతో మీకేంపని?"

సర్పరాజు దర్పంగా అన్నాడు.

"పేను పెసరచేను వేసుకుంటే, రాజు కోసేసుకున్నాడు. రాజుకి బుద్ధి చెప్పాలి. అందుకే వచ్చాం!"

---


***అంకితం:*** **నవల పరిశోధన మీద వ్యాసం రాయమన్నారు తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య పి.రామ నరసింహంగారు. నవలకు మూలమయిన కథా స్వరూపం గురించి ఆలోచిస్తోంటే, అనేక విషయాలతోపాటు, జానపద కథా స్వరూపం- దానిలో ఇమిడి ఉన్న ఆధునిక కథా స్వభావం స్ఫురించాయి. ఈ కథకు ఊపిరి వచ్చింది. అందుకే ఇది, ఆచార్య రామ నరసింహంగారికే అంకితం. జానపద కథా స్వరూపాలలోని, ఆధునిక కథా స్వభావాల విశ్లేషణను విద్యార్థులచేత జరిపిస్తారన్న ఆకాంక్షతో-**

**- సి.ఆనందారామం**

---

"బుద్ధిలేకపోతే సరి! రాజుకి బుద్ధి చెప్పగలిగినదెవరు? హాయిగా అడవిలో నా పుట్టలో నేనున్నాను. పేను పెసరచేను ఏమయితే నాకెందుకు?"

"అలా అనకండి దైవస్వరూపా! ఈరోజు పెసరచేను కోసుకున్నారు. రేపు అడవి అంతా తగలబెట్టి అయినా, పుట్టలోంచి మిమ్మల్ని బయటికి లాగి, మీ



అమూల్యమయిన మణులన్నీ లాక్కుపోతారు. మీరు బుసకొడ్తారు కనుక మిమ్మల్ని చంపైనా చంపుతారు. కనికరించండి."

పాముకి కనికరంకంటె ఎక్కువగా భయం కలిగింది.

"మనం నలుగురం కలిసిమాత్రం ఏం చెయ్యగలం? రాజుగారికి బోలెడు పరివారం..."

"అది నిజమే! మనం నలుగురం కలిసి ఆలోచిద్దాం. ఏదో ఒక ఉపాయం తోచకపోదు...' అన్నాడు, నల్లి.

నలుగురూ రకరకాల ఆలోచనలు చేసారు. చివరికి ఒక "ప్లాన్" అందరికీ నచ్చింది.

అనుకున్న ప్రకారం పథకం అతి రహస్యంగా అమలు జరిపారు.

రాత్రి బాగా చీకటి పడ్డాక, రాజుగారి గంధపు చెక్కల మంచం మధ్య నల్లి దాక్కున్నాడు. పేను రాజు గెడ్డంలో ప్రవేశించాడు. రాజుగారి దువ్వెన ఉండే షెల్ఫ్‌లో తేలు దాక్కున్నాడు. రాజుగారి స్లిప్పర్స్ మధ్య పాము తల దాచుకున్నాడు.

సమయం చూసుకుని సన్నగా సంకేతం పంపి నల్లి రాజు వీపుమీద నాలుగువైపులా కుట్టాడు. రాజుకి నిద్రాభంగమయి లైట్ స్విచ్ వెయ్యబోయేలోగా పేను గడ్డాన్ని ఇష్టంవొచ్చిన చోట కరిచాడు. రాజు దువ్వెనకోసం మంచానికి ఆనుకుని ఉన్న షెల్ఫ్‌లో చెయ్యి పెట్టగానే, తేలు కసుక్కున కుట్టాడు. రాజు బాధతో లేచి, పరివారాన్ని పిలవాలని మంచంకిందనే ఉన్న చెప్పులు తొడుక్కోబోతే, పాము బుస కొట్టకుండా కాటేసాడు.

రాజు బాధతో చేసిన ఆర్తనాదం సౌండ్ ప్రూఫ్ గదిలోంచి ఎవరికీ వినిపించలేదు. నలుగురూ చల్లగా నాలుగు వైపులకూ జారుకున్నారు.

అంతా ముగిసిపోయాక శవపరీక్షలో "నా పెసరచేను ఖరీదు తీసుకున్నాను" అనే అక్షరాలు నెత్తురుతో రాసినవి కనిపించాయి.

అదేమిటో ఎవరికీ అర్థం కాలేదు. పెసరచేను కథ తెలిసిన రాజు పరివారం భయంతో పెదవి విప్పలేదు.

కానీ, కథకి కాళ్ళున్నాయి. అతికొద్ది కాలంలోనే అసలు కథ అందరిముందుకూ వచ్చేసింది.

త్రికాలాలలోనూ అందరూ ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు ఈ కథని చెప్పుకొంటూనే ఉన్నారు- ఉంటారు.

భవిష్యత్తులోంచి ఒక ప్రశ్న వినిపించింది.

"ఇంతకూ తరువాతి రాజులకి బుద్ధి వచ్చిందా?"

సమాధానం తెలియని వర్తమానం వెలవెలపోయింది.

---

## బిస్కెట్లు



"ఇంట్లో వున్న వస్తువులన్నీ చెక్కు చెదరకుండా ఎక్కడివి అక్కడే వున్నాయి కదా? దొంగలు పడ్డారని కంప్లయింట్ ఎందుకిచ్చారు" అని అడిగాడు ఎస్.ఐ. అండాళ్ళును.

"నిజంగానే పడ్డారు. సామాన్లు ఏమీ ముట్టుకోలేదు. కానీ ఇంట్లో వున్న బిస్కెట్లు అన్నిటినీ తీసుకుపోయారు.

"పోలీసులతోనే పరాచికాలా? బిస్కెట్లు పోతేనే కంప్లయింట్ ఇవ్వాలా?" కోపంగా అన్నాడు ఎస్.ఐ.

"పోయినవి మామూలు బిస్కెట్లు కాదు. బంగారం బిస్కెట్లు" లబోదిబోమంది అండాళ్ళు.